
సాక్షి
గుంటూరు
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



గుణదలకు క్రైస్తవుల పాదయాత్ర

దుగ్గిరాల: ఆర్‌సీఎం మత పెద్దలు, దీక్ష తీసుకున్న క్రైస్తవులు బుధవారం గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి డాక్టర్ సురేష్ యామర్తి ఆధ్వర్యాన పాదయాత్ర చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.

సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరుడి ఉపాలయంలో బుధవారం సంకట హర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శేషసాయిశర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం కూడా చేశారు.

న్యూస్‌రీల్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందితో పలు ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సంగడిగుంట, పొన్నూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ తీగల వల్ల జరిగే అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ప్రచార వాల్‌పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. గుంటూరు–2 ఫైర్ స్టేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కేరళకు తరలిస్తున్న గోవులు పట్టివేత



మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద 30 గోవులను పట్టుకున్నారు. శ్రీకాకుళం నుంచి కేరళకు గోవులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వీహెచ్‌పీ నేతలు టోల్‌గేట్ వద్ద కాపలా వుండి 30 గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను, డ్రైవర్ అన్సారీని పట్టుకుని మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు గోవులను గో ఆశ్రమానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సబ్ జైలులో జిల్లా జడ్జి పరిశీలన



రేపల్లె రూరల్: రేపల్లె సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ బుధవారం సందర్శించారు. జైలు పరిసరాలను, ఖైదీల గదులను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. నేరం ఆరోపించబడి ప్రైవేటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారి కోసం ప్రభుత్వం ఉచిత న్యాయ సేవలు అందించేందుకు ప్రభుత్వ న్యాయవాదిని ఏర్పాటు చేసిందన్నారు. అవసరమైన వారు ప్రభుత్వ న్యాయవాది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది గుమ్మడి కుమార్‌బాబు, సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు

యద్దనపూడి: మండలంలోని పూనూరు, చింతగుంటపాలెం, గన్నవరం గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ఆరుగాలం శ్రమించి పండించిన పంట కల్లాల్లో తడిసి ముద్ద కావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే అకాల వర్షంతో మరింత నష్టం చేకూరిందని వాపోతున్నారు. సుమారు 2 గంటలపాటు ఎడతెరిపి లేకుండా కుంభవృష్టిగా వర్షం పడటంతో కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న, పందిళ్లపై ఉన్న పొగాకు పంటలు పూర్తిగా తడిసిపోయాయి. తద్వారా పంటకు బూజు, ఫంగస్ పట్టి పంట నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీ రామ తీర్థ సేవాశ్రమం బజార్‌లోని శ్రీ మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇటీవల ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. బుధవారం గాయత్రి పీఠం ప్రధాన అర్చకులు విష్ణువర్ధన్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం కందుల శ్రీనివాసరావు తండ్రి జ్ఞాపకార్థం రూ. 17 లక్షలను ఆలయ పునర్నిర్మాణానికి అందించారు. వేలమంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


హనుమా.. అవినీతి కనుమా!

దేవదాయ శాఖ ఆదాయానికి శఠగోపం

- గుంటూరులోని దేవదాయశాఖ ఆలయాల్లో అవినీతి పర్వం
- నాజ్‌సెంటర్ ఆంజనేయస్వామి ఆలయంలో తారస్థాయికి..
- పూజలకు టోకెన్‌లకు కూడా ఇవ్వకుండా భక్తుల నుంచి డబ్బులు వసూలు
- అనుమతులు లేకుండా సొంత కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు
- పూర్తిస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం



నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం



ఆంజనేయ స్వామి ఆలయంలో పూజా సామగ్రిని ఇచ్చే బుట్ట



పూజాకిట్‌లో ఇవ్వాల్సిన సామగ్రి పట్టిక

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం లాలాపేటలోని శ్రీ వేంకటేశ్వ స్వామి గ్రూప్ ఆలయాలకు సంబంధించి కొంత మంది సిబ్బంది, అర్చకులు వ్యవహరిస్తున్న తీరు భక్తులకు తీరని మనోవ్యథను కలిగిస్తోంది. వేంకటేశ్వరస్వామి గ్రూప్ ఆలయాల కింద నాజ్‌సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి, జగన్నాథ స్వామి ఆలయాలు ఉన్నాయి. దీనిలో భాగంగా ఇటీవలి కాలంలోనే ఆంజనేయ స్వామి దీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, సిబ్బందిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆలయ ప్రధాన అర్చకుడిపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన ఇష్టానుసారంగా వ్యవహరించటంతో పాటు సిబ్బందిని సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆయన చెప్పిన మాట వినకుంటే అక్కడ వేధింపుల పర్వం తప్పదని చెబుతున్నారు.

ఫిర్యాదుల పరంపర

ఆంజనేయస్వామి దేవస్థానం, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై, దేవదాయ ధర్మదాయ శాఖ ఉద్యోగులపై పలు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో హనుమాన్ దీక్షా సమాజంలోని కొంతమంది సభ్యులు నేరుగా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన శ్రీరామనవమి రోజున కల్యాణోత్సవంలో భాగంగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.40వేల వరకు వసూలు చేసి, వారివరకే కల్యాణం నిర్వహించటంతో పాటు, ఆలయానికి కట్టాల్సిన రూ.2వేలు రశీదు ఇవ్వలేదని, దాతలకు సైతం ఎటువంటి రశీదులు ఇవ్వలేదని చెబుతున్నారు. హనుమాన్ దీక్షా సమాజంలో సైతం స్వామి వారి మాలధారణలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకుండా, కేవలం బెంగళూరు నుంచి వచ్చిన ఒక వ్యక్తి, ఆయన అనుచరగణం చెప్పిన విధంగానే కార్యక్రమాలు జరిపిస్తున్నారని తెలుస్తోంది. హనుమాన్ దీక్షా సమాజానికి ఎటువంటి అనుమతులు లేకపోయినా.. గత కొన్నేళ్లుగా స్వాములకు భిక్ష పెడుతున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే ఆ దీక్షా సమాజానికి సంబంధించి కొంత మంది వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వీటితో పాటుగా ఎటువంటి అనుమతులు లేకుండా వారి కుటుంబసభ్యులు కొంత మందిని అర్చకులుగా నియమించుకుంటున్నారని చెబుతున్నారు. ఇటీవల కాలంలో గోడలకు వేయించిన స్వామి వారి బొమ్మల రంగులు పెయింటింగ్స్, పాలరాయితో చేయించిన బొమ్మలకు సంబంధించి రూ.లక్షలు భక్తుల నుంచి వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

అన్ని ఆలయాల్లో ఇదే పరిస్థితి

నగరంలో లాలాపేట గ్రూప్ ఆలయాలతో పాటు పాతగుంటూరులోని అగస్తేశ్వరస్వామి రికార్డ్ అసిస్టెంట్ 15 ఏళ్లకు పైగా అక్కడే తిష్టవేసి ఉండటంతో దోపిడీకి తెరదీశారని భక్తులు చెప్పుకుంటున్నారు. కొత్తపేట శివాలయంతో పాటు నగరంలో ప్రముఖ ఆలయాల్లో ఉద్యోగులు, ఈఓలు, అర్చకులు ఇదే విధంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై దేవదాయశాఖ డీసీ కేబీ శ్రీనివాస్‌ను వివరణ అడగగా ఆయన తనకు ఏమి సంబంధం లేదంటూ చెప్పటం గమనార్హం.

దుకాణదారులతోనూ కుమ్మక్కు

ఆంజనేయస్వామి దేవస్థానంలో వేలం ద్వారా దుకాణాలను దక్కించుకున్న వారితోనూ ఆలయ అర్చకులు, సిబ్బంది కుమ్మక్కై వ్యవహరిస్తున్న తీరు స్పష్టంగా కనపడుతోంది. తమలపాకుల పూజ, తులసీపూజ, అంకుర్పాణ మొదలగు ప్రతి పూజలకు ఖచ్చితంగా దేవదాయ శాఖకు నగదు చెల్లించాల్సిందే. ఈ పూజలు చేయించుకోదలచిన భక్తులు ముందు రోజే రూ.300 చలానా కట్టి వారి పేర్లు నమోదు చేసుకోవాలి. అయితే ఆలయ ప్రధాన అర్చకుడు, సిబ్బంది ఆలయం బయట ఉన్న దుకాణంలో మాత్రమే సామగ్రిని కొనాలని లేకుంటే పూజలకు ఇతరత్రా సామగ్రి పనికిరావని భక్తులకు చెప్పి భయపెడుతున్న పరిస్థితి ఉందని తెలుస్తోంది. దీంతో దేవదాయశాఖ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పూజకు రూ.300, సామాగ్రి కిట్‌కు రూ.600 కలుపుకొని మొత్తం రూ.900 చెల్లిస్తే.. దుకాణదారుడు ఉదయం పూజకు వచ్చిన భక్తులకు ఆలయంలో పూజా సామగ్రి బుట్టలు ఇచ్చానని చెబుతాడు. ఇదీ ముందస్తు ప్లాన్ ప్రకారమే జరుగుతుంది. చిన్న పల్లికల బుట్టలో ఏదో నామ్‌కే వాస్తే.. వస్తువులు ఇచ్చి భక్తులను మభ్య పెడుతున్నారనే వాదనలు వినవస్తున్నాయి. కిట్‌లో రావాల్సిన 27 వస్తువులకు గాను కేవలం 10 మాత్రమే ఇస్తున్నారని భక్తులు చెబుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

నాజ్‌సెంటర్ ఆంజనేయస్వామి దేవస్థానంపై వస్తున్న ఆరోపణలను విచారిస్తాం. పూర్తిస్థాయిలో అన్ని విషయాలు తెలుసుకున్న తరువాత అధికారులకు నివేదిక అందజేస్తాం. టోకెన్‌లు తెంచకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఖచ్చితంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తాం.

– ఎ.రామకోటిరెడ్డి, లాలాపేట గ్రూప్ ఆలయాల ఏసీ

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పల్లె పడక

- కూటమి పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందులే
- వారి కష్టాలు తెలుసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆరోపించారు. చెరుకుపల్లి మండలం గుల్లపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాయడమే కాకుండా పేదలను ఇబ్బంది పెట్టేలా కూటమి పాలన ఉందన్నారు. పది నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 18వ తేదీన 'పల్లె పడక' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. చెరుకుపల్లి మండలం అల్లావారిపాలెంలో ఆ రోజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే రోజు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. రాత్రికి గ్రామంలో బస చేసి, ప్రజలతో మమేకమై అక్కడే నిద్రించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రధాని సభకు పటిష్ట ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: మే 2వ తేదీన అమరావతిలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎస్పీ సతీష్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా లతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నోడల్ అధికారులకు విధులు కేటాయించిందన్నారు. జిల్లా అధికారులకు కూడా వారు నిర్వహించాల్సిన విధులపై సూచనలు జారీ చేశామన్నారు. ప్రధాని పర్యటనను అధికారులు ప్రతిష్టగా భావించి విజయవంతం చేయాలన్నారు. ప్రధాన సభలో పాల్గొనే ముందు ప్రధాని రోడ్‌షో ఉంటుందని వాటి ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాంగణమంతా శానిటేషన్ చక్కగా ఉండాలని చెప్పారు. ప్రాంగణమంతా సుందరీకరణ చేయాలన్నారు. అవసరమైన సిబ్బందిని ఆయా శాఖలు నియమించుకోవాలన్నారు. సభా ప్రాంతంలో సీటింగ్ ఏర్పాటుతో పాటు మంచినీరు, స్నాక్స్ ఏర్పాటు చేయాలన్నారు.

రూట్‌మ్యాప్‌పై అవగాహన ఉండాలి..

కార్యక్రమానికి సంబంధించి రూట్ మ్యాప్‌పై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగింపు వరకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోపాలు ఉండకూడదని తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు 5 ప్రాంతాలు గుర్తించామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనే వాహనాలు పార్క్ చేసే విధంగా చూడాలని తెలిపారు. బ్యారికేడ్లు, మొబైల్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాని కార్యక్రమానికి భారీ స్థాయిలో ప్రజలు హాజరవుతారని, వారు సురక్షితంగా ఇంటికి చేరే వరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వివరించారు. అడిషన్ ఎస్పీ సుప్రజ, డీఆర్ఓ ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగరాజు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన..

వెలగపూడి(తాడికొండ): మే 2వ తేదీన తుళ్ళూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్, పలువురు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు ప్రయాణించే మార్గాలకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్లు నవీన్, ప్రవీణ్ చంద్, ఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, సీఆర్డీఏ, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కోసం పోరుబాట



ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు మిర్చి యార్డు ఎదుట గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన ప్రదర్శన చేస్తున్న రైతులు



జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు, మిర్చి రైతులు

పెట్రోలు ట్యాంకర్ బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రమాదం.. డ్రైవర్‌కు గాయాలు
- చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ వద్ద ఘటన



చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ వద్ద బోల్తా పడిన పెట్రోలు ట్యాంకర్ లారీ

చేబ్రోలు: సడన్‌గా బ్రేక్ వేయడంతో పెట్రోలు ట్యాంకర్ లారీ బోల్తా పడిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లి నుంచి చీరాలకు పెట్రోలుతో వెళ్తున్న హెచ్‌పీ కంపెనీ లారీ చేబ్రోలు మండలం నారాకోడూరు జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దగ్గరకు వచ్చేవరకు స్పీడ్ బ్రేకర్ కనిపించక, డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఘటన జరిగింది. ఈ సంఘటనలో విజయవాడకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ కె.వీరాస్వామికి గాయాలవటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా ప్రాంతానికి ట్రైనీ ఐపీఎస్ దీక్ష, తెనాలి డీఎస్పీ జనార్ధన్, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ డి.వెంకటకృష్ణ, తహసీల్దార్ కె.శ్రీనివాసశర్మ, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

బెంబేలెత్తిన స్థానికులు, వాహనదారులు

సుమారు ఎనిమిదివేల లీటర్లు పెట్రోలు ఉన్న ట్యాంకర్ లారీ బోల్తా పడటంతో పాటు కొంత లీకేజీ అవుతుండటంతో స్థానికులు, రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది పెట్రోలు ట్యాంకర్ చుట్టూ నురగ (ఫోమ్)ను స్ప్రే చేసి ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టారు. పొన్నూరు–గుంటూరు రోడ్డులో వాహన రాకపోకలను పోలీసులు నిలుపుదల చేశారు. ట్రాఫిక్‌ను ఇతర ప్రాంతాల ద్వారా మళ్లించారు.

ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు

నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ ఎదురు జీబీసీ రహదారిపై పెట్రోలు ట్యాంకర్ బోల్తా పడటంతో పొన్నూరు–గుంటూరు రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరు నుంచి వచ్చే వాహనాలను నారాకోడూరు వద్ద, పొన్నూరు వైపు నుంచి వచ్చే వాహనాలను చేబ్రోలు వద్ద వేరే రహదారుల వైపు మళ్లించారు. ఆ రోడ్లు సింగిల్ లైన్లు కావటంతో వాహనాలు ఎదురు ఎదురుగా వచ్చి పలు చోట్ల గంటల కొద్దీ నిలిచిపోయాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

మద్యం మత్తులో సముద్రంలోకి దిగితే కఠిన చర్యలు

- బహిరంగ ప్రదేశంలో మద్యం తాగినా జైలు శిక్ష తప్పదు
- మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదు
- బీచ్ సందర్శకులకు బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరిక

బాపట్ల టౌన్: మద్యం మత్తులో సముద్రంలోకి దిగే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని, ఈ మేరకు పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. బుధవారం సూర్యలంక తీరంలో జిల్లా ఎస్పీ పర్యటించారు. తీరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, గజ ఈతగాళ్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సూర్యలంక బీచ్ పర్యాటకంగా ఎంతో ప్రఖ్యాతిగాంచిందన్నారు. వేసవి కావడంతో యాత్రికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా సందర్శకుల రక్షణ కోసం పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తీర ప్రాంతంలో పోలీస్ గస్తీని ముమ్మరం చేయడంతోపాటు యాత్రికులు ప్రమాదాలకు గురైనప్పుడు వారిని రక్షించేందుకు స్థానిక, మెరైన్ పోలీసులతోపాటు గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువ లోతులోకి వెళ్లే వారిని సులభంగా గుర్తించి అప్రమత్తం చేసేందుకు డ్రోన్‌లను వినియోగించాలని పేర్కొన్నారు. సముద్ర తీరాలకు విహారానికి వచ్చే యాత్రికులు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతు దాటి లోపలకి వెళ్లకుండా యాత్రికులను అప్రమత్తం చేస్తూ సముద్రంలో జెండాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. యాత్రికులు బీచ్ పరిసరాల్లో వ్యవహరించాల్సిన తీరును వివరిస్తూ తీరంలో ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. లోతుకు వెళ్తున్న యాత్రికులను అడ్రెస్సింగ్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలన్నారు. గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది లైఫ్ జాకెట్స్ ధరించి అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించేందుకు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.



తీరంలోని గజ ఈతగాళ్లు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,000** గరిష్ఠం : రూ. **9,000**

మోడల్ ధర రూ. **7,200**

క్లుప్తంగా

యార్డుకు 1,59,032 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,59,032 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,57,640 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు లభించింది. తాలు రకం మిర్చి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,896 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో 572 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

- కొమ్ములు 388 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,750, గరిష్ఠ ధర రూ.12,200, మోడల్ ధర రూ.11,700,
- కాయలు 184 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,750, గరిష్ఠ ధర రూ.12,200, మోడల్ ధర రూ.11,700, మొత్తం 429 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

కీబోర్డులో గిన్నిస్ రికార్డు



పెదకాకాని: మ్యూజికల్ కీ బోర్డులో కొప్పురావూరుకు చెందిన ఉషారాణి రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కించుకుంది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన టి.ఉషారాణి స్ఫూర్తి మహిళా సంక్షేమ అభివృద్ధి సంస్థ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. 2024 డిసెంబరు 1వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ గంట సమయం పాటు 17 దేశాలకు చెందిన 1090 మంది ఒకే టైమ్‌లో నాన్‌స్టాప్‌గా కీ బోర్డు ప్లే చేయడం జరిగింది. ఈ వీడియో రికార్డును నాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరిగింది. వీడియోను వీక్షించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ వారు కొప్పురావూరుకు చెందిన టి.ఉషారాణిని గిన్నిస్‌బుక్ రికార్డు కు ఎంపిక చేయడం జరిగింది. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్ మణికొండలో నిర్వహించిన కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టీన్ దండంగి, బ్రదర్ అనిల్ కుమార్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ ప్రతినిధి ఆనంద్ రాజేంద్రన్‌ల చేతుల మీదుగా సర్టిఫికెట్, మెడల్‌ను టి.ఉషారాణికి అందజేశారు.

చెరువును చెరబట్టారు

పాములపాడు చెరువులో టీడీపీ నేతల మట్టి దందా

- అక్రమ తవ్వకాలు జరిపి జేబులు నింపుకొంటున్న వైనం
- ట్రాక్టరుకు రూ.650 వసూలు చేస్తూ పంచాయతీ ఆదాయానికి భారీగా గండి
- గ్రామంలో బావుల్లో నీరు ఇంకిపోయి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- టీడీపీలో ఇరువర్గాల పోరుతో షాడో ప్రజా ప్రతినిధి వద్దకు చేరిన మట్టి పంచాయితీ



పాములపాడు చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న తమ్ముళ్లు

పాములపాడు(తాడికొండ): తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో టీడీపీ నాయకుల మట్టి దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరజిల్లుతుంది. పూడికతీత పేరుతో గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా తెలుగుతమ్ముళ్లు అక్రమ దందాకు తెరలేపారు. తాగునీటి చెరువులో అక్రమ తవ్వకాలకు తెరలేపి మట్టిని అందిన కాడికి అమ్ముకొని జేబులు నింపుకొంటున్నారు. ట్రాక్టరుకు రూ.650 నుంచి దూరాన్ని బట్టి రూ.1000 వరకు వసూలు చేస్తూ అక్రమ సంపాదనకు తెరలేపారు. నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి సమాచారం ఇచ్చి తీర్మానం చేసిన అనంతరం అందరి ఆమోదంతో చెరువు అభివృద్ధి చేసి గట్లు పటిష్టం చేయాలి. సీనరేజీ రూపంలో వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలో జమచేయాల్సి ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా జమ చేయకుండా వెనకేసుకుంటున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారు.

షాడో ప్రజా ప్రతినిధి చెంతకు పంచాయితీ

పాములపాడు గ్రామంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాల పంచాయితీ షాడో ప్రజా ప్రతినిధి చెంతకు చేరింది. ఇరువర్గాలు తమకు వాటా అందడం లేదంటూ కార్యాలయానికి చేరుకొని ఫిర్యాదులు చేయడంతో తెరవెనుక ఉన్న సదరు ప్రజా ప్రతినిధి పోలీసు, రెవెన్యూ అధికారులకు హుకుం జారీ చేసి బుధవారం మట్టి తవ్వకాలను నిలుపుదల చేయించారు. అనంతరం అక్రమ మైనింగ్ చేస్తున్న తమ్ముళ్ల కార్యాలయానికి చేరుకొని ఏం మాట్లాడారో ఏమో తెలియదు కానీ సాయంత్రానికి అంతా చక్కబెట్టుకొని మళ్లీ దందా ప్రారంభించారు.

- దీనిపై తాడికొండ సీఐ కె.వాసును వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేనందున మట్టి తవ్వకాలు నిలిపివేయించడం జరిగిందన్నారు. తిరిగి ప్రారంభించిన సంగతి తమకు తెలియదని, మైనింగ్ జరుగుతుంటే నిలుపుదల చేయిస్తానని తెలిపారు.

నిబంధనలకు పాతర



రాత్రిళ్లు తరలిపోతున్న మట్టి

నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించాలంటే పంచాయతీ తీర్మానం, రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇక్కడ అలాంటి అనుమతులు ఏమీ లేకుండానే జోరుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. గత 5 రోజులుగా ఈ తంతు రాత్రి పగలు, తేడా లేకుండా కొనసాగుతుండటంతో గ్రామస్తులు జేబులు గుల్ల చేసుకొని మట్టిని తోలుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు మరమ్మతుల పేరుతో పరిమితికి మించిన లోతు తవ్వి టీడీపీ నాయకులు జేబులు నింపుకొంటుండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి సరే దోపిడీకి తెరలేపి జనం జేబులు గుల్ల చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

పీఎఫ్ పనులపై వచ్చి ఉపాధ్యాయుడు మృతి

- గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో కుప్పకూలిన ఉపాధ్యాయుడు చల్లా వెంకటరెడ్డి
- జూన్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా.. ఇంతలోనే మృత్యువాత



వెంకటరెడ్డి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: బోధన వృత్తిలో సుదీర్ఘ సేవలందించిన ఉపాధ్యాయుడు హఠాన్మరణం చెందారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చల్లా వెంకటరెడ్డి (62) బుధవారం పీఎఫ్ క్లియరెన్స్, ఎన్‌ఓసీ కోసం గుంటూరు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని విజిటర్స్ కుర్చీలో కూర్చుని ఉండగానే, తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఆయన వెంట ఉన్న కుమారుడు ప్రసన్నాంజనేయులు రెడ్డితో పాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది హుటాహుటిన సమీపంలోని రమేష్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తక్షణమే సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక రమేష్ ఆస్పత్రికి వచ్చి వెంకటరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించారు. ఆయన కుమారుడిని పరామర్శించి, అంబులెన్స్‌లో ఆయన స్వస్థలమైన పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి పంపారు. మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ పొంది, కుటుంబ సభ్యులతో కలసి శేష జీవితాన్ని ఆనందంగా గడపాల్సిన ఉపాధ్యాయుడు ఈ విధంగా హఠాన్మరణం చెందడంతో తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా పీఎఫ్ క్లియరెన్స్, ఎన్‌ఓసీ కోసం నరసరావుపేట డీఈఓ కార్యాలయానికి వెళ్లాల్సిన వెంకటరెడ్డి సరైన సమాచారం లేకపోవడంతో గుంటూరు డీఈఓ కార్యాలయానికి వచ్చి ఈ విధంగా మృతి చెందారు.

కళా పురస్కారాలు ప్రదానం

తెనాలి: డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాటక కళా పరిషత్ జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో అయిదోరోజైన బుధవారం తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన సాంఘిక, పౌరాణిక పద్యనాటక కళాకారులు బద్దుల తిరుపతయ్య, దేవిశెట్టి కృష్ణారావు, చెన్నం సుబ్బారావును సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించి, కళాపురస్కారాన్ని ప్రదానం చేశారు. తొలుత గుంటూరుకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యగురువు సరిత శిష్యబృందం, ఆరిశెట్టి ఐశ్వర్య శిష్యబృందం, యనమదల రీతిక, శవ్వా గ్రీష్మశ్రీలు కూచిపూడి, జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి పర్యవేక్షించారు. ఆరో రోజైన గురువారం సాయంత్రం కళాంజలి, హైదరాబాద్ వారి 'అన్నదాత', సహృదయం ద్రోణాదుల వారి 'వర్క్ ఫ్రమ్ హోం' నాటికల ప్రదర్శనలు వుంటాయని తెలియజేశారు.



దేవిశెట్టి, తిరుపతయ్య, సుబ్బారావుకు కళాపురస్కారాల ప్రదానం

తెనాలి డీఎస్పీకి ఏబీసీడీ అవార్డు



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా నుంచి అవార్డు అందుకుంటున్న డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్ సీఐ, చేబ్రోలు ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు

తెనాలి రూరల్: సంచలనం సృష్టించిన దళిత బాలిక హత్య కేసును ఛేదించిన తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) కన్సోలేషన్ ప్రైజ్ అవార్డు (డీజీపీ మెడల్) అందుకున్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంకు చెందిన ఏడో తరగతి చదువుతున్న దళిత బాలిక పేరిపోగు శైలజను గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసే కృష్ణా జిల్లాకు చెందిన నరమామిడి నాగరాజు గతేడాది దారుణంగా హత్య చేయడం.. ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడం తెలిసిందే. కేసును చేబ్రోలు పోలీసులు నమోదు చేయగా, డీఎస్పీ జనార్ధనరావు దర్యాప్తు చేశారు. హత్యకు పాల్పడి పరారైన నాగరాజు, తన సెల్‌ఫోన్, సిమ్‌ను మార్చి వేసి పోలీసులకు సవాల్ విసిరాడు. సుమారు మూడు నెలల పాటు నిందితుడి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించి అతికష్టం మీద అతడిని గుర్తించి అరెస్ట్ చేశారు. కీలకమైన కేసును ఛేదించడంలో కృషి చేసిన డీఎస్పీ, చేబ్రోలు పోలీసులను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అభినందించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో తెనాలి డీఎస్పీకి ఏబీసీడీ కన్సోలేషన్ ప్రైజ్ అవార్డును డీజీపీ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి తెనాలి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పోలీసులకు అవార్డులు..

చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సంచలనం కలిగించిన దళిత బాలిక హత్య కేసును ఛేదించిన పోలీసులకు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం బెస్ట్ అవార్డులను అందజేశారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ, చేబ్రోలు పీఎస్ కానిస్టేబుళ్లు ఎ.అప్పలనాయుడు, జి.నాగరాజులకు డీజీ అవార్డులు అందజేశారు.

88 ఏళ్ల వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

విలేకరుల సమావేశంలో డాక్టర్ ఫణీంద్ర కుమార్ వెల్లడి



డాక్టర్ ఫణీంద్రకుమార్‌ను అభినందిస్తున్న సినీ నటుడు మురళీమోహన్, పక్కన ఆపరేషన్ చేయించుకున్న లక్ష్మణరావు

గుంటూరు మెడికల్: స్వర పేటికకు పెరాలసిస్ వచ్చి ఎనిమిది నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్న 88 సంవత్సరాల వృద్ధుడికి ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా అరుదైన ఆపరేషన్ చేసి గొంతు సమస్యను సరిచేసినట్లు గుంటూరులోని శ్రీ సత్య సాయి ఫణీంద్ర కుమార్ ఈఎన్‌టీ అండ్ వాయిస్ క్లినిక్ అధినేత, వాయిస్ సర్జన్ డాక్టర్ వి.ఫణీంద్ర కుమార్ చెప్పారు. బుధవారం గుంటూరు బ్రాడీపేటలో ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు ఆయన వెల్లడించారు. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన 88 సంవత్సరాల లక్ష్మణరావు 8 నెలలుగా స్వర పేటిక పెరాలసిస్‌కు గురై మాట రాక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. లక్ష్మణరావు కుమారులు అమెరికాలో ఉండటంతో అక్కడికి వెళ్లిన వృద్ధుడు అమెరికాలో వైద్యులను సంప్రదిస్తే ఇండియాలో ఆపరేషన్ చేసే వైద్యులు ఉన్నారని అక్కడే చేయించుకోవాలని సూచించారు. దీంతో లక్ష్మణరావు పిల్లలు ఇండియాలోని తమ బంధువుల సలహా మేరకు ఫిబ్రవరి నెలలో చికిత్స కోసం లక్ష్మణరావును తమ వద్దకు తీసుకు వచ్చారన్నారు. వైద్య పరీక్షలు చేసి స్వర పేటిక పెరాలసిస్ వల్ల గొంతు రాకపోవడం, పీలగా మారటం చాలా చిన్నగా మాట్లాడటం వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఎలాంటి కారణం లేకుండానే స్వర పేటిక పెరాలసిస్ రావడంతో ఫిబ్రవరి 17న సుమారు రెండు గంటలసేపు థైరోప్లాస్టి ఆపరేషన్ చేసి సమస్యను నివారించామన్నారు. కొద్దిరోజులపాటు వాయిస్ థెరపిస్ట్ పర్యవేక్షణలో లక్ష్మణరావుకు స్పీచ్ థెరపి చేయించడంతో నేడు పూర్తిస్థాయిలో మాట్లాడుతున్నట్లు డాక్టర్ ఫణీంద్ర కుమార్ వెల్లడించారు. మెడికల్ జర్నల్స్ లో 88 సంవత్సరాల వయసున్న వృద్ధుడికి ఆపరేషన్ చేయటం ప్రపంచంలో ఇదే మొట్టమొదటిసారి వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ భార్గవ్, మత్తు వైద్యులు డాక్టర్ సురేంద్ర పాల్గొన్నట్లు తెలిపారు. అరుదైన ఆపరేషన్ చేసి స్వర సమస్యను సరిచేసి మామూలు వ్యక్తి లాగా మాట్లాడే విధంగా చేసిన డాక్టర్ ఫణీంద్ర కుమార్ కు సీనియర్ సినీ నటుడు, లక్ష్మణరావు బావ అయిన మురళీ మోహన్ అభినందనలు తెలిపారు.

ఏఎన్‌యూలో నేడు వార్షికోత్సవం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా, యూనివర్సిటీ సైన్స్ కళాశాల, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల యాన్యువల్ డే సెలబ్రేషన్స్ గురువారం జరుగుతాయని వేడుకల కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య సీహెచ్ లింగరాజు, డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణ తేజ, విశిష్ట అతిథిగా హైదరాబాద్ సీఎస్‌బీ అకాడమీ ప్రతినిధి ఎం.బాలలత, చీఫ్ ప్యాట్రన్‌గా వీసీ ఆచార్య కె.గంగాధరరావు, పాట్రన్స్‌గా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్ఎన్ రవి కుమార్, గౌరవ అతిథులుగా ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎ.ప్రమీలారాణి హాజరవుతారన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు..

యూనివర్సిటీ కళాశాలల యాన్యువల్ డే సెలబ్రేషన్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేడుకల ఏర్పాట్లకోసం ఆరు ప్రత్యేక కమిటీలను నియమించామన్నారు. యాన్యువల్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు వేడుకల్లో బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటడం అభినందనీయం



రోచిష్మతిని అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఈఓ రేణుక

పెదకాకాని: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి జిల్లాకు మంచిపేరు తేవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బిత్రా రోచిష్మతి ఈనెల 7వ తేదీ నుంచి 12 వరకు మణిపూర్‌లో జరిగిన 68వ జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. అండర్–17 విభాగంలో పాల్గొన్న రోచిష్మతి ఉత్తమ ప్రతిభ కనబరచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రోచిష్మతిని డీఈఓ రేణుక సమక్షంలో కలెక్టర్ నాగలక్ష్మి సత్కరించారు. జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడమే కాకుండా రానున్న రోజుల్లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మంచిపేరు తేవాలని కలెక్టర్ ప్రోత్సహించారు. అదేవిధంగా పాఠశాల పీఈటీ చంద్ర వినయ్‌కుమార్‌ను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కరీముల్లా చౌదరి, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ మెల్లెంపూడి రవి, నేషనల్ టీం కోచ్ నాగ శిరీష తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ టామ్ చెరియన్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైనట్లు మణిపాల్ హాస్పిటల్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్ హెడ్, లివర్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ తెలిపారు. బుధవారం మణిపాల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలేయం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచే అవయవాల్లో ప్రధానమైనదని, తీసుకున్న ఆహారం జీర్ణం అవ్వాలన్నా, శరీరానికి శక్తి సరిగ్గా అందాలన్నా, విష పదార్థాలు బయటకు వెళ్లాలన్నా లివర్ సరిగ్గా పనిచేయాలన్నారు. మణిపాల్ హాస్పిటల్ సౌత్ ఏషియన్ లివర్ ప్రోగ్రామ్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న 60 మంది రోగులలో దాదాపు 13 మంది రోగులు ఈ కొత్త ఎర్లీ రికవరీ ఆఫ్టర్ సర్జరీ ఈఆర్ఏఎస్ కార్యక్రమం నుంచి విజయవంతంగా ప్రయోజనం పొందారని వివరించారు. మణిపాల్ హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ తక్కువ సమయంలో మణిపాల్ హాస్పిటల్ కాలేయ వ్యాధికి అత్యుత్తమ కేంద్రంగా మారిందన్నారు. పిల్లలలో అత్యధిక సంఖ్యలో కాలేయ మార్పిడిని నిర్వహించినట్లు పేర్కొన్నారు. గత కొన్ని నెలల క్రితం కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న నాలుగు సంవత్సరాల బాలుడికి జీవించి వున్న దాతనుంచి కాలేయ మార్పిడిని విజయవంతంగా మణిపాల్ హాస్పిటల్ వైద్యబృందం శస్త్రచికిత్స నిర్వహించిందని తెలిపారు. సాధారణంగా కాలేయ మార్పిడి తరువాత రోగిని 20 రోజులలో డిశ్చార్జి చేస్తారని, కానీ ఇటీవల 56 సంవత్సరాల వయస్సు గల కాకినాడకు చెందిన లక్ష్మీ శ్రీనివాస్‌కు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స అనంతరం 5 రోజుల్లో డిశ్చార్జి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అరవింద్, డాక్టర్ రాజేష్, డాక్టర్ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.